మంద కృష్ణ మాదిగ పర్యటనను విజయవంతం చేయాలి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 17: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పర్యటనను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని కృషిభవన్‌లో ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత - సుప్రీం కోర్టు విచారణ - రీజకీయ పక్షాల వైఖరి - ప్రస్తుత కర్తవ్యం అనే అంశంపై ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల పార్లమెంట్ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గీకరణకు అండగా నిలిచిన బీజేపీకే మాదిగలంతా అండగా నిలవాలని కోరారు.

'ఈటల' కాంగ్రెస్‌లో చేరుతారా?



వైరల్ అవుతున్న కాంగ్రెస్‌నేతలతో భేటీ ఫొటో

● నెట్టింట జోరుగా చర్చ

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు, మాజీ మంత్రి ఈటల రాజేందర్ కాంగ్రెస్‌లో చేరనున్నారా అన్నది రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఆయన బీజేపీని వీడుతారని, కాంగ్రెస్‌లో చేరి ఆ పార్టీ అభ్యర్థిగా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నారని ప్రచారం జరుగుతోంది. తాజాగా కాంగ్రెస్ నేతలు మైనంపల్లి హన్మంతరావు, మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి తదితరులతో అల్పాహార విందులో ఈటల రాజేందర్ పాల్గొన్నట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫొటో ఈ చర్చకు దారితీసింది. ఈటల ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో హుజూరాబాద్, గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పోటీచేసి ఓడిపోయారు.



కాంగ్రెస్ నేతలతో ఈటల రాజేందర్

● పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో..

పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ నాయకత్వం అవకాశం కల్పిస్తే బీజేపీ అభ్యర్థిగా మల్కాజ్‌గిరి నియోజకవర్గం నుంచి పోటీ చేయాలనే ఆసక్తితో ఉన్నానని ప్రకటించారు. తన సొంత నియోజకవర్గమైన కరీంనగర్ పార్లమెంట్ స్థానంలో సిట్టింగ్ ఎంపీగా బండి సంజయ్‌కుమార్ ఉన్నందున అక్కడ నుంచి టికెట్ ఆశించడం భావ్యం కాదని ఆయన మీడియాతో వెల్లడించారు. కాంగ్రెస్ నేతలతో బ్రేక్ ఫాస్ట్ చేస్తున్న ఫొటో సోషల్ మీడియాలో వైరల్ కావడం ఆయన బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరబోతున్నారని, కరీంనగర్ పార్లమెంట్ స్థానం నుంచి ఆపార్టీ అభ్యర్థిగా పోటీచేస్తారని చర్చలు మొదలయ్యాయి. కాంగ్రెస్ నేతలతో తన బేటీకి ప్రాధాన్యం లేదని ఈటల రాజేందర్ ప్రకటించినా అటు కాంగ్రెస్ పార్టీలో ఇటు బీజేపీలో మాత్రం చర్చలు జోరుగా సాగుతూనే ఉన్నాయి. టీఆర్ఎస్‌లో రాష్ట్ర మంత్రిగా కీలక పాత్ర నిర్వహిస్తూ వచ్చిన ఈటల రాజేందర్‌ను ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు మంత్రివర్గం నుంచి తొలగించారు. దీంతో ఆయన శాసనసభ్యత్వానికి, పార్టీకి రాజీనామా చేశారు. అనంతరం బీజేపీలో చేరి హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆ పార్టీ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. బీజేపీలో చేరక ముందు ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరతారని ప్రచారం జరిగింది. బీజేపీలో చేరిన తర్వాత ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్‌తో ఈటల రాజేందర్‌కు విభేదాలు నెలన్నాయి. ఆయన పార్టీ వీడుతారని కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం ప్రారంభమై అది ఇప్పటి వరకు కొనసాగుతూనే వస్తున్నది. ఈటల మాత్రం తను పార్టీని వీడేది లేదంటూ చెబుతూ వస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఆయన కాంగ్రెస్ నేతలను కలువడం చర్చనీయాంశంగా మారింది. ఈటల రాజేందర్ ఆశిస్తున్న మల్కాజ్‌గిరి స్థానంలో పార్టీ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి పొల్సాని మురళీధర్‌రావు టికెట్ ఆశిస్తున్నారు. ఆయన తన టికెట్ ఖాయమనే భావనతోనే నియోజకవర్గంలో రాజకీయ కార్యకలాపాలను ముమ్మరం చేస్తూ వస్తున్నారు. సొంత నియోజకవర్గమైన కరీంనగర్‌లో సిట్టింగ్ ఎంపీ అయిన బండి సంజయ్‌కుమార్, మల్కాజ్‌గిరిలో పి మురళీధర్‌రావుకు అవకాశం దక్కితే రాజేందర్ పార్లమెంట్ ఎన్నికలకు దూరంగా ఉండాల్సిన పరిస్థితులు ఎదురవుతాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన ఆయన క్రియాశీల రాజకీయాల్లో ఉండేందుకు పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయడం అనివార్యం. ఆ అవకాశం బీజేపీలో దక్కేలా లేదని, అందుకే ఈటల రాజేందర్ కాంగ్రెస్‌లో చేరక తప్పని పరిస్థితి ఉత్పన్నమైందనే ప్రచారం సాగుతున్నది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ ప్రచారానికి ఈటల రాజేందర్ స్పందన ఎలా ఉంటుందో వేచిచూడాలి.

మతంపేరుతో జరిగే దాడులను

తీవ్రంగా ఖండిస్తున్నాం

- జన్వాడ దళితులపై దాడి కారంచేడు, చుండూరు లాంటిదే
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ ఎస్ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న ప్రవీణ్ కుమార్

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 17: మతం పేరుతో మైనార్టీలు, దళితులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో కరీంనగర్ క్రిస్టియన్ ఫోరం ఆధ్వర్యంలో జన్వాడలో క్రైస్తవులపై జరిగిన దాడిని నిరసిస్తూ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీలపై దాడులు రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. జన్వాడలో క్రైస్తవులు, దళితులపై జరిగిన దాడి చుండూరు, కారంచేడు లాంటిదేనని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రార్థన మందిరాలకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగంలోని 25 అధికరణను కాపాడాలని మణిపూర్‌లో ఇలాంటి మతపరమైన దాడులు చేసి హత్యలు చేశారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. హాస్టళ్లలో విద్యార్థినులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, వాళ్ల ప్రాణాలను రక్షించాలని ఒక్కరు కూడా అడగడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల కంటే ముందు మైనార్టీల ప్రాణాలకు గ్యారంటీ ఇవ్వాలన్నారు. అసెంబ్లీలో కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ పగుళ్ల గురించి మాట్లాడడంలో తప్పులేదని, జన్వాడ దాడుల గురించి అధికారంలో ఉన్నవారు కాని, ప్రతిపక్షంలో ఉన్నావారు కాని ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. పేదలపై జరిగే దాడులు ప్రభుత్వానికి పట్టవా అని ప్రశ్నించారు. ఇదేనా ప్రజాపాలన అంటూ ధ్వజమెత్తారు. క్రైస్తవులు, దళితులపై జరిగిన దాడులపై ముఖ్యమంత్రి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. దాడులు జరిగిన స్థలాన్ని కలెక్టర్ పరిశీలించకపోతే న్యాయం ఎలా జరుగుతుందన్నారు. క్రైస్తవులపై దాడిలు జరిగితే మంద కృష్ణమాదిగ ఎందుకు స్పందించలేదని, ఆయన ఎక్కడకు వెళ్లారని ప్రశ్నించారు. రాముడు క్రైస్తవులు, ముస్లింలపై దాడులు చేయమని చెప్పలేదన్నారు. క్రైస్తవులపై దాడి జరిగితే పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారని విమర్శించారు. అన్ని వర్గాల ప్రజల కోసం పోరాడేది బహుజన పార్టీ మాత్రమే అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు ఎం క్రిస్టోఫర్, ఎం పాల్‌నాయక్, వై డానియల్ ఎలీషా, చంద్రభాను, జయరాజ్ జాన్, ఎజర, బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నల్లాల శ్రీనివాస్, రంగు సంపత్, మేకల రవీందర్ పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల ఆర్డర్‌ను ఇప్పించాలి

● కలెక్టరేట్ ఎదుట చేనేత కార్మికుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న చేనేత కార్మికులు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 17: బతుకమ్మ చీరల ఆర్డర్‌ను ఇప్పించాలని గంగాధర మండలం గర్శకుర్తి గ్రామ చేనేత కార్మికులు కోరారు. చేనేత పవర్‌లూం సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని చేనేత కార్మికులు నేత పనిపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. ఈనెల 13న కేంద్ర విజిలెన్స్ అధికారులు తమ గ్రామంలో ఒక కార్మికుడి మరమగ్గాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మరమగ్గాలపై కలర్ చీరలను తయారు చేయవద్దని నేత కార్మికుడిపై కేసు నమోదు చేయడం బాధాకరమన్నారు. ఈ దాడుల వల్ల నాలుగు రోజులుగా పని చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. తమ బతుకులు మరమగ్గాలతో ముడిపడి ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం బతుకమ్మ చీరల ఆర్డర్ ఇప్పించాలని కోరారు.

వైభవంగా ఎదుర్కోలు ఉత్సవం

- పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్
- పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సారె సమర్పణ



వాహనసేవలో మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 17: నగరంలోని మార్కెట్‌రోడ్ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం నిత్య హోమం, పూర్ణాహుతి చేశారు. కల్పవృక్ష వాహనంపై శ్రీవారు ఆలయ మాడ వీధుల్లో విహరించారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో అమ్మవార్లకు సారె సమర్పించారు. శనివారం కావడంతో ఆలయం భక్తులతో పోటెత్తింది. కార్యక్రమంలో అర్చకులు లక్ష్మీనారాయణాచార్యులు, నాగరాజాచార్యులు, వంశపారంపర్య ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, ఈవో వుడుతల వెంకన్న, కాంగ్రెస్ నియోజకవర్గ కన్వీనర్ పురుమల్ల శ్రీనివాస్, నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్ పాల్గొన్నారు.

సాయంత్రం హోమం, పూర్ణాహుతి తర్వాత రాత్రి అశ్వ, గజ వాహన సేవలతో ప్రకాశం గంజ్ వరసిద్ధి వినాయకస్వామి ఆలయం నుంచి ఎదుర్కోలు ఉత్సవం నేత్రపర్వంగా జరిగింది. పండితులు పురాణం మహేశ్వరశర్మ, కల్వకుంట్ల వేదాంతాచార్యులు స్వామివారు, అమ్మవార్ల తరఫున ప్రతినిధులుగా గుణగణాలను వివరించి జరిపిన చర్చలు అలరించాయి. ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాలు, హారతులు, భగవన్నామ నామస్మరణలు, కోలాట, శాస్త్రీయ నృత్యాలు, భజనల మధ్య శోభాయాత్రగా ఆలయానికి తీసుకువచ్చారు. దారిపొడవునా భక్తులు నీరాజనాలిచ్చి స్వాగతం పలికారు.

● వేడుకలో పాల్గొన్న మంత్రి 'పొన్నం'

ఎదుర్కోలు వేడుకలో మంత్రి పొన్నం ప్రభాకర్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం జరిగే కల్యాణంలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. సాంస్కృతిక కళావేదికపై గాయకుడు, ఉత్సవాల కల్చరల్ ఆర్గనైజర్ సల్వాజి ప్రవీణ్ నేతృత్వంలో భజనమండళ్ల పారాయణాలు, భజనలు, కీర్తనలతో ఆలయం మారుమ్రోగింది. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.



ఎదుర్కోలు వేడుకల్లో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్

● నేడు కల్యాణోత్సవం... గరుడవాహనసేవ

ఉదయం 9 గంటల నుంచి యాగశాలలో నిత్యహవనం, పూర్ణాహుతి, మధ్యాహ్నం 12-15 నిముషాలకు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి, లక్ష్మీనారాయణస్వామి కల్యాణం, సాయంత్రం 6 గంటల నుంచి నిత్యహోమం, పూర్ణాహుతి, రాత్రి గరుడవాహనసేవ నిర్వహిస్తారు. సాంస్కృతిక వేదికపై ఉదయం భక్తి సంకీర్తనలు, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి.

దారులన్నీ మేడారానికే..

- నేటి నుంచి ప్రత్యేక బస్సులు
- సమ్మక్క-సారలమ్మ గద్దెల వరకు రవాణా సౌకర్యం
- జీరో టికెట్‌తో మహిళలకు ఉచిత ప్రయాణం



కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 17: సమ్మక్క- సారలమ్మను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున మేడారానికి తరలివెళ్తున్నారు. సమ్మక్క జాతరకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. మరోవైపు మేడారానికి లక్షలాదిగా తరలి వెళ్లే భక్తుల కోసం టీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. ఉమ్మడి జిల్లా నుంచి మేడారానికి దాదాపు మూడు నుంచి నాలుగు లక్షల మంది భక్తులు వెళతారని భావిస్తున్న ఆర్టీసీ అధికారులు కరీంనగర్ రీజియన్ పరిధి నుంచి 850 ప్రత్యేక బస్సులను నడిపించాలని నిర్ణయించింది. ఈ బస్సులు సమ్మక్క-సారలమ్మ గద్దెల సమీపానికి వెళతాయి. ఈ మేరకు ఆర్ఎం సుచరిత భక్తుల రద్దీని బట్టి మేడారానికి ప్రత్యేక బస్సులు నడిపించాలని డిపో మేనేజర్లను ఆదేశించారు. భక్తులు ఎక్కువగా మేడారం వెళ్లే ఏడు పాయింట్ల నుంచి ప్రత్యేక బస్సులను నడిపించాలని సూచించారు. కరీంనగర్, హుజూరాబాద్, హుస్నాబాద్, గోదావరిఖని, మంథని, పెద్దపల్లి, యైంటిక్లయిన్‌కాలనీ మొత్తం చోట్ల నుంచి ఆదివారం నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను మేడారానికి నడిపించనున్నది. ప్రతి పాయింట్ వద్ద ప్రయాణికులకు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

ప్రత్యేక బస్సు చార్జీలు

	పెద్దలకు	పిల్లలకు
	(రూపాయల్లో)	
1. కరీంనగర్ నుంచి మేడారం	380	210
2. హుస్నాబాద్ నుంచి.. "	350	190
3. హుజురాబాద్ నుంచి.. "	310	170
4. పెద్దపల్లి నుంచి .. "	380	210
5. మంథని నుంచి .. "	320	180
6. యైంటిక్లయిన్ కాలనీ నుంచి..	370	200
7. గోదావరిఖని నుంచి..	370	200

తాగునీటి వసతిని కల్పించారు. ఏడు పాయింట్లలో ఆదివారం ఆయా డిపోల మేనేజర్లు మేడారానికి వెళ్లే బస్సులను ప్రారంభిస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న గృహలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఈ ప్రత్యేక బస్సుల్లో కూడా జీరో టికెట్‌తో ఉచితంగా ప్రయాణించే సౌకర్యాన్ని కల్పించారు. ప్రత్యేక బస్సుల్లో 90 శాతం పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులే నడిపిస్తున్నారు.



ఆర్టీసీ బస్సుల్లో సురక్షితంగా ప్రయాణించండి

- ఆర్ఎం సుచరిత



ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానం చేర్చడమే టీఎస్ ఆర్టీసీ ప్రధాన ధ్యేయం. మేడారంలో అత్యంత ఘనంగా జరిగే సమ్మక్క సారలమ్మ జాతరకు కరీంనగర్ రీజియన్ నుంచి లక్షల సంఖ్యలో భక్తులు వెళ్లి దర్శించుకుంటారు. ఆ భక్తులకు సౌకర్యం కల్పించేందుకు కరీంనగర్ రీజియన్ పరిధిలోని 425 బస్సులు, ఇతర ప్రాంతాల నుంచి మరో 425 బస్సులను మేడారం జాతరకు ప్రత్యేక బస్సులుగా నడిపిస్తున్నాము. ఆదివారం నుంచి ఏడు పాయింట్ల నుంచి ఈ ప్రత్యేక బస్సులు మేడారం వెళ్తాయి. మేడారంలోని సమ్మక్క సారలమ్మ గద్దెలకు అతి సమీపం వరకు ఈ బస్సులను నడిపించి అక్కడ ప్రయాణికులను దించడం, ఎక్కించుకుని వస్తాయి. దీంతో పార్కింగ్, గద్దెల వద్దకు వెళ్లేందుకు ఇబ్బందులు తప్పుతాయి. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. 24వ తేదీ వరకు మేడారానికి ప్రత్యేక బస్సులను నడిపిస్తున్నందున కొన్ని రూట్లలో బస్సులు రద్దు చేశాం. ప్రజలు తప్పనిసరి అయితే తప్ప ప్రయాణాలను వాయిదా వేసుకొని ఆర్టీసీకి సహకరించాలి.

అత్తింటి ఎదుట తోడికోడళ్ల భైఠాయింపు

మానకొండూర్, ఫిబ్రవరి 17: మండలంలోని గంగిపల్లిలో ప్రేమించి, పెళ్లి చేసుకుని మోసం చేశాడని ఆరోపిస్తూ అత్తింటి ఎదుట శనివారం భైఠాయించారు. బాధిత మహిళలు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గంగిపల్లి గ్రామానికి చెందిన గొడిశాల రమేశ్, గొడిశాల వెంకటేశ్ ఇద్దరు అన్నదమ్ములు. రమేశ్ అదే గ్రామానికి చెందిన చంద్రకళ అనే యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. కొంత కాలం తరువాత చంద్రకళ మరో చోట ఉంటోంది. ఈ నేపథ్యంలో రమేశ్ మరో యువతిని పెళ్లి చేసుకుని ఊర్లోనే కాపురం పెట్టాడారు. అతని తమ్ముడు గొడిశాల వెంకటేశ్ హైదరాబాద్‌లో ఓ ప్రయివేట్ కంపెనీలో ఉద్యోగం చేసేవాడు. ఆ సమయంలో హైదరాబాద్‌లో స్థిరపడిన కర్ణాటకకు చెందిన రాధికతో పరిచయం ఏర్పడింది. రాధికకు ముందే పెళ్లి అయి ఒక కుమారుడు ఉన్నాడు. కాగా రాధికకు భర్త చనిపోయాడు. రాధికకు, వెంకటేశ్‌కు ఏర్పడిన పరిచయం పెళ్లికి దారి తీసింది. కొంత కాలం రాధికతో ఉన్న వెంకటేశ్ గంగిపల్లికి వచ్చి మరో యువతిని పెళ్లి చేసుకుని ఇక్కడే ఉంటున్నాడు. వెంకటేశ్ తన దగ్గరికి రాకపోవడంతో రాధిక అతడి విషయంపై ఆరా తీయగా మరో పెళ్లి చేసుకున్న విషయం తెలిసింది. దీంతో శనివారం ఆమె గ్రామానికి చేరుకుని తనకు న్యాయం చేయాలని వెంకటేశ్ ఇంటి ఎదుట భైఠాయించింది. విషయం తెలుసుకున్న రమేశ్ మొదటి భార్య చంద్రకళ సైతం రాధికతో పాటు భైఠాయించింది. చంద్రకళ ఇంటిముందు భైఠాయించిందన్న విషయం తెలుసుకున్న రమేశ్ ఆమెకు ఫోను చేయడంతో చంద్రకళ వెళ్లిపోయింది. ఇంటిముందు రాధిక ఒక్కతే ఉండడంతో వెంకటేశ్‌తో పాటు అతని కుటుంబ సభ్యులు దాడి చేసి గాయపరిచినట్లు బాధితురాలు వాపోయింది. సమాచారం తెలుసుకున్న ఎస్సైశ్రీకాంత్ సంఘటనా స్థలానికి చేరుకొని వెంకటేశ్ కుటుంబసభ్యులను స్టేషన్‌కు పిలిపించి న్యాయం చేస్తామని చెప్పి రాధికను తీసుకెళ్లారు. రాధిక ఫిర్యాదు మేరకు వెంకటేశ్‌తో పాటు అతడి అన్న, తల్లిదండ్రులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మల్యాల, ఫిబ్రవరి 17: కరీంనగర్-జగిత్యాల మార్గంలోని కొండగట్టు మారుతీ టౌన్‌షిప్ వద్ద శనివారం కారు-బైక్ ఢీ కొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టౌన్ షిప్ సమీపంలో జగిత్యాల వైపు నుంచి స్విఫ్ట్ కారుతో పాటు కొడిమ్యాల మండలం అప్పారావుపేటకు చెంది న గరిగంటి శ్రీనివాస్(40) అనే వ్యక్తి ద్విచక్రవాహనం ప్రమాదవశత్తూ ఢీకొన్నాయి. దీంతో అతను కింద పడగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన శ్రీనివాస్‌ను 108లో జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో మృతి చెందాడు. శ్రీనివాస్ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రహీం తెలిపారు.

ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

కథలాపూర్, ఫిబ్రవరి 17: మండలంలోని గంభీర్‌పూర్ శివారులోని వాగులో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టుకున్నామని ఎస్సై నవీన్ తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా రన్న సమాచారం మేరకు తమ సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నామన్నారు. కేసు నమోదు చేశామని తెలి పారు. వాగుల్లోంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

రేవంత్.. సంకుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

» బీసీల గురించి రాహుల్ మాట్లాడడం విడ్డూరం: కవిత



హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఏర్పాటు తర్వాత చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే(ఎస్‌కేఎస్) వివరాలు ఒకే కుటుంబం దగ్గర ఉన్నాయంటూ సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడడం తగదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఇకనైనా సంకుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించారు. 2011లో యూపీఏ ప్రభుత్వం రూ.4,500 కోట్ల ఖర్చుతో దేశవ్యాప్తంగా కులగణన చేసినా, నివేదిక మాత్రం బయటపెట్టలేదని దుయ్యబట్టారు. ఆ వివరాలను గాంధీ కుటుంబం దాచిపెట్టుకుందా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఇప్పుడు బీసీల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి బీసీల వ్యతిరేకి అని, గతంలో పార్లమెంట్‌లోనే రాజీవ్‌గాంధీ బీసీలకు వ్యతిరేకంగా మాట్లాడారని ఆరోపించారు. తలా తోకా లేకుండా ప్రవేశపెట్టిన తీర్మానంతో కులగణన ఎలా చేస్తారని నిలదీశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు ఉంటుందన్న ఊహాగానాలపై అడిగిన ప్రశ్నకు కవిత ఆచితూచి స్పందించారు. పొత్తు అంశం గురించి చెప్పేంత స్థాయి తనది కాదని పేర్కొన్నారు.

రవాణా శాఖలో భారీగా బదిలీలు

» ఏడుగురు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌లు, 23 మంది ఆర్టీఓలు, 150 మంది ఎంవీఐల బదిలీ

రవాణా శాఖలో ఏళ్ల తరబడి నుంచి ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న పలువురు రవాణాశాఖ అధికారులు(ఆర్టీఓ), ఎంవీఐలను బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. రాజకీయ పైరవీలతో పని చేయాల్సిన కేంద్రానికి బదులుగా లాభదాయకమైన చెక్‌పోస్టుల్లో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌లు, సహాయ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌ల డిప్యూటేషన్‌లను గతవారం ప్రభుత్వం రద్దు చేసింది. తాజాగా రవాణా శాఖలో పూర్తి స్థాయిలో ప్రభుత్వం బదిలీలతో ప్రక్షాళన ప్రారంభించింది. మొట్టమొదటి సారిగా ప్రతీ అధికారి బదిలీ కోసం ప్రత్యేక జీవోను విడుదల చేసింది. ఏడుగురు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌లు, 23 మంది ఆర్టీఓలు, 150 మంది ఎంవీఐలను బదిలీ చేసింది.

గొర్రెల కొనుగోళ్ల బిల్లుల చెల్లింపులో మోసం!

» దర్యాప్తులో దూకుడు పెంచిన ఏసీబీ

» ఏపీ రైతుల స్టేట్‌మెంట్ రికార్డు

ఆంధ్రప్రదేశ్ రైతుల నుంచి గొర్రెల యూనిట్లు కొనుగోలు చేసి వారికి బిల్లులు చెల్లించకుండా దారి మళ్లించిన కేసు దర్యాప్తులో ఏసీబీ దూకుడు పెంచింది. ఎనిమిది మంది రైతులను శనివారం విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేసింది. ఏపీకి చెందిన 18 మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన 133 యూనిట్ల గొర్రెలకు సంబంధించి రూ.2.8 కోట్లు చెల్లించాల్సి ఉంది. అయితే ఎంతకీ తమ బిల్లు చెల్లింపుకాకపోవడంతో రైతులు పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో ఆరా తీయగా బిల్లులు మంజూరైనట్లు తెలిసింది. తమ పేరుతో వేరొకరు బిల్లులు తీసుకున్నట్లు తెలియడంతో తాము మోసపోయినట్టు గుర్తించిన బాధితులు గత డిసెంబరులో సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ వద్ద కొన్న గొర్రెల యూనిట్లకు డబ్బులు చెల్లించలేదని కాంట్రాక్టర్‌తోపాటు పశుసంవర్ధక శాఖ అధికారులపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఈ కేసు ఆధారంగా అవినీతి కోణంలో ఏసీబీ అధికారులు విచారణ చేపట్టారు. 8 మంది ఏపీ రైతులను విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. కాంట్రాక్టర్ మోహినుద్దీన్, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు రవి కుమార్, కేశవసాయిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

కాంగ్రెస్ గూటికి భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం?



ఖమ్మం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు త్వరలోనే కాంగ్రెస్‌లో చేరబోతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు హైదరాబాద్‌లో చర్చలు జరిగినట్లు కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పది అసెంబ్లీ నియోకవర్గాలుండగా.. భద్రాచలంలో మాత్రమే బీఆర్ఎస్ విజయం సాధించింది. గతంలో బీఆర్ఎస్‌లోనే ఉన్న తెల్లం వెంకట్రావు అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రస్తుత రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. అయితే భద్రాచలంలో కాంగ్రెస్ నుంచి అప్పటికి సిటింగ్ ఎమ్మెల్యేగా పొదెం వీరయ్య ఉండడంతో తెల్లంకు టికెట్ విషయంలో భరోసా లభించలేదు. అదే సమయంలో బీఆర్ఎస్ నుంచి టికెట్ ఆఫర్ రావడంతో వెంకట్రావు మళ్లీ బీఆర్ఎస్ గూటికి చేరారు. జిల్లాకు చెందిన మంత్రి పొంగులేటి అనుచరుడిగా ఉన్న వెంకట్రావు అసెంబ్లీ ఎన్నికల తర్వాత వెంటనే కాంగ్రెస్‌లో చేరతారని ప్రచారం జరగగా.. ఆయన కొట్టిపారేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధికి రూ.10కోట్లు నిధులు కేటాయించింది. ఆ నిధుల వినియోగంపై జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులకు అధికారం కల్పించింది. దీనికితోడు త్వరలో మార్కెట్ కమిటీలతో పాటు పలు నియామక కమిటీలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టబోతోంది. ఈ నేపథ్యంలోనే తెల్లం కాంగ్రెస్ గూటికి చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్టు తెలిసింది. జిల్లా మంత్రి పొంగులేటితో పాటు మరో రాష్ట్ర మంత్రితో మంతనాలు సాగించి పార్టీలో చేరేందుకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. లోక్‌సభ ఎన్నికలకు ముందే వెంకట్రావు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునే అవకాశం ఉందని సమాచారం. అయితే తెల్లం వర్గీయులు మాత్రం తమ ఎమ్మెల్యే బీఆర్ఎస్‌లోనే ఉంటారని, కాంగ్రెస్‌లో చేరే అవకాశం లేదని చెబుతున్నారు.

సీపీఆర్ చేసి వ్యక్తి ప్రాణాలు కాపాడిన ఎస్సై

వీడియో వైరల్ కావడంతో ప్రశంసల వెల్లువ


బాధితుడికి సీపీఆర్ చేస్తున్న ఎస్సై మైబెల్లి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : కుటుంబ సమస్యలతో వేదనకు గురైన ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. సమాచారం అందుకున్న ఎస్సై హుటాహుటిన అక్కడికి చేరుకొని బాధితుడికి సీపీఆర్ చేయడంతో అతను ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బెంగాల్‌కు చెందిన సంతోష్ ముఖర్జీ(38) ఇబ్రహీంపట్నంలోని బీఈఎల్ కన్‌స్ట్రక్షన్ సంస్థలో కూలి పని చేస్తున్నాడు. కుటుంబ సమస్యలతో మానసిక వేదనకు గురైన సంతోష్. శనివారం ఉన్నట్టుండి తాను పనిచేసే సంస్థ సమీపంలో ఉన్న అటవీ ప్రాంతం వైపు వెళ్లాడు. గమనించిన తోటి కూలీలు పోలీసు వాహనంలో అటుగా వచ్చిన ఎస్సై మైబెల్లికి సమాచారమిచ్చారు. వెంటనే స్పందించిన ఎస్సై చుట్టుపక్కల వెతకగా.. సంతోష్ చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. కిందకి దింపి చూసి శ్వాస ఆడటం లేదని తెలిసి సీపీఆర్ చేశారు. కొద్దిసేపటికి బాధితుడు స్పృహలోకి రావడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతను కోలుకుంటున్నాడు. కాగా, బాధితుడికి ఎస్సై మైబెల్లి సీపీఆర్ చేస్తున్న వీడియో వైరల్ కావడంతో ఆయన చేసిన పనికి సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

పాల్గొన్న ముఖ్య నేతలు, బీఆర్ఎస్ శ్రేణులు.. ఆటో డ్రైవర్లకు ప్రమాదబీమా పత్రాలు అందజేసిన కేటీఆర్

» 'అతనే ఒక చరిత్ర' పేరిట కేసీఆర్‌పై డాక్యుమెంటరీ ప్రదర్శన

» కేసీఆర్‌కు గవర్నర్, సీఎం రేవంత్, హరీశ్, కేటీఆర్, కవిత శుభాకాంక్షలు

హైదరాబాద్/జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 70వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో 70 కిలోల కేక్‌ను కట్‌చేశారు. అంతకుముందు బీఆర్ఎస్ నేతలతో కలిసి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ తల్లి విగ్రహానికి, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేతుల మీదుగా పలువురు ఆటో డ్రైవర్లకు రూ.1లక్ష కవరేజీతో కూడిన ప్రమాదబీమా పత్రాలను అందజేశారు. అదేవిధంగా దివ్యాంగులకు వీల్ చైర్లను పంపిణీ చేశారు. రాజకీయం, తెలంగాణ ఉద్యమ నేపథ్యం, కేసీఆర్ జీవితంలోని ముఖ్యమైన సందర్భాలపై 'అతనే ఒక చరిత్ర' పేరిట సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో రూపొందించిన డాక్యుమెంటరీని ప్రదర్శించారు. కేసీఆర్ ఆమరణ దీక్ష విశేషాలను వివరించేలా ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం ప్రమాదవశాత్తు మరణించిన 70 మంది బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు ప్రమాద బీమా కింద ఒక్కొక్కరికి రూ.2లక్షల చొప్పున మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను మాజీ మంత్రులు తలసాని, మహమూద్ అలీ అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీలు కె.కేశవరావు, బడుగుల లింగయ్య యాదవ్, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, మాజీ మంత్రులు మహమూద్‌అలీ, తలసాని, నిరంజన్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, శ్రీనివాస్ గౌడ్, పలువురు పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు. కాగా, కేసీఆర్‌కు రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆమె శుభాకాంక్షలు తెలుపుతూ రాసిన లేఖను, పుష్ప గుచ్ఛాన్ని గవర్నర్ కార్యాలయ ప్రతినిధి ఒకరు తెలంగాణ భవన్‌లో అందజేశారు. కేసీఆర్‌కు మాజీ మంత్రి హరీశ్‌రావు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ స్థాపికుడు, స్వరాష్ట్ర సాధకుడు అని ట్విటర్ వేదికగా కొనియాడారు. కేసీఆర్‌కు జనసేన అధినేత పవన్ కల్యాణ్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పోరాట పటిమతో అంచలంచెలుగా ఎదిగిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు.


ఆటో డ్రైవర్లకు చెక్కులు అందజేస్తున్న కేటీఆర్

కేసీఆర్ ప్రతిపక్ష నేత పాత్రను సమర్థంగా పోషించాలి: రేవంత్

అసెంబ్లీ వేదికగా మాజీ సీఎం కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. "40 ఏళ్ల కేంద్ర, రాష్ట్ర రాజకీయాల్లో తనకంటూ పాత్ర పోషించిన కేసీఆర్.. తెలంగాణ పునర్‌నిర్మాణంలో ప్రతిపక్ష నాయకుడి పాత్రను సమర్థంగా పోషించాలి. భగవంతుడు ఆయనకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలి' సీఎం రేవంత్ ఆకాంక్షించారు.

ఎర్రవల్లిలో ఆయుష్య హోమం

కేసీఆర్ 70వ జన్మదినం సందర్భంగా శనివారం ఆయన దత్తత గ్రామమైన సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలో మాజీ సర్పంచ్ భాగ్యబాల్‌రాజు ఆధ్వర్యంలో ఆయుష్య హోమం నిర్వహించారు. ఉదయం రంగనాయకస్వామి ఆలయంలో కేసీఆర్ పేరున అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో పండ్లు పంపిణీ చేశారు. మరోవైపు.. కేసీఆర్ తన జన్మదిన వేడుకలను ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో నిరాడంబరంగా జరుపుకొన్నారు. శనివారం ఉదయం మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రానికి వచ్చి కేసీఆర్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డిపై అవిశ్వాసం

» కాంగ్రెస్‌లో చేరిన మరుసటి రోజే బీఆర్ఎస్ ప్రతిపాదన

» వికారాబాద్ అదనపు కలెక్టర్‌కు తీర్మాన ప్రతి అందజేత

వికారాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతామహేందర్‌రెడ్డిపై బీఆర్ఎస్ జడ్పీటీసీ సభ్యులు అవిశ్వాసం ప్రకటించారు. మొత్తం 12 మంది జడ్పీటీసీలు చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ సంతకాలు చేసిన తీర్మాన పత్రాన్ని శనివారం జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు అందజేశారు. కాంగ్రెస్‌లో చేరిన మరుసటి రోజే వ్యూహాత్మకంగా వికారాబాద్, తాండూరు మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, రోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ జడ్పీటీసీలు సునీతపై అవిశ్వాసం ప్రకటించారు. ఈ తీర్మానంపై బీఆర్ఎస్ జడ్పీటీసీలు జడ్పీ వైస్ చైర్మన్ బైండ్ల విజయకుమార్(మోమిన్‌పేట), కె.నాగిరెడ్డి(దోమ), కె.మహిపాల్(దౌల్తాబాద్), ఎం.మేఘమాల(పూడూరు), కె.సుజాత (ధారూరు), కె.జయమ్మ(నవాబుపేట), నాగరాణి(కొడంగల్), హరిప్రియ(పరిగి), మంజుల(తాండూరు), ప్రమోదిని(వికారాబాద్), పి.మధుకర్(మర్పల్లి), కె.రాందాస్(కులకచర్ల) సంతకాలు చేశారు. అవిశ్వాస తీర్మానం అందజేసిన 15 రోజుల్లో అధికారులు నోటీసులు జారీ చేయాల్సి ఉంటుంది. అయితే, ఈ అంశంలో అధికారులు ఏ విధంగా వ్యవహరించనున్నారన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం వికారాబాద్ జిల్లా పరిషత్‌లో బీఆర్ఎస్‌కు 14మంది సభ్యులు ఉండగా, కాంగ్రెస్‌కు నలుగురు సభ్యులు ఉన్నారు. కాంగ్రెస్‌లో చేరిన సునీతా మహేందర్‌రెడ్డి బేషరతుగా చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేయాలని జడ్పీ వైస్ చైర్‌పర్సన్ బైండ్ల విజయ్‌కుమార్ డిమాండ్‌చేశారు. రాజీనామా చేయకుండానే ఆమె పార్టీ మారడాన్ని ఖండిస్తూ అవిశ్వాసం ప్రకటించామన్నారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి సైతం తన పదవికి రాజీనామా చేసిన తర్వాతే కాంగ్రెస్‌లో చేరాలని సూచించారు. బీఆర్ఎస్‌లో చేరినప్పుడు ఏమి ఆశించి వచ్చారో... అదే ఆశించి ఇప్పుడు కాంగ్రెస్‌లోకి వెళ్లారని విమర్శించారు. పట్నం దంపతులకు పదవీ వ్యామోహమే తప్ప.. ప్రజలపై ప్రేమ లేదని దుయ్యబట్టారు.

యాదాద్రి ఆలయంలో బ్రేక్ దర్శనం అమలు తీరుపై పరిశీలన

వేములవాడ, ఫిబ్రవరి 17: ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి దేవస్థానంలో వీఐపీ బ్రేక్ దర్శనం అమలు సాధ్యాసాధ్యాలపై అధికా రులు యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో క్షేత్ర స్థాయి పరిశీలన జరిపారు. తిరుమల, యాదాద్రి ఆలయాల తరహాలో రాజరాజేశ్వర స్వామివారి దేవస్థానం లోనూ బ్రేక్ దర్శనం సౌకర్యం కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక శాసనసభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఇటీవల సూచించారు. ఈ మేరకు రాజన్న ఆలయ ఏఈవో బి.శ్రీనివాస్, ప్రొటోకాల్ పర్యవేక్షకులు శ్రీరాములు, నాగుల మహేష్, ఇంజనీరింగ్ అధికారి నాగ రాజు శనివారం యాదాద్రి వెళ్లి అక్కడ వీఐపీ బ్రేక్ దర్శనాల విధి విధానాలను ప రిశీలించారు. ఈ సందర్భంగా యాదాద్రి ఆలయ ప్రొటో కాల్ అధికారులు ఏఈవో రామ్మోహన్, పర్యవేక్షకుడు రాజన్ బాబు వీఐపీ బ్రేక్ దర్శనం కోసం తీసుకుంటున్న చర్యలు, అమలుతీరును వివరించారు. ఉదయం 9 నుంచి 10 వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు 1500 మంది చొప్పున రోజుకు మొత్తం మూడు వేల మందికి వీఐపీ బ్రేక్ దర్శన సౌకర్యం కల్పిస్తున్నామని, వీఐపీ బ్రేక్ దర్శనం టికెట్ రుసుము కింద 300 రూపాయలు వసూలు చేస్తున్నట్లు వివరించారు.


యాదాద్రి ఆలయ అధికారులతో చర్చిస్తున్న సిబ్బంది

కొండగట్టులో భక్తుల సందడి

మల్యాల, ఫిబ్రవరి 17: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో కిటకిటలాడింది. వేలాదిగా భక్తులు వేకువజాము నుంచే స్వామి వారి దర్శ నానికి బారులు తీరారు. భక్తులతో క్యూలైన్లు నిండిపోయాయి. భక్తులు ఆలయంలో అంజన్నను దర్శించుకున్న అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారికీ మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీ రోజంతా నిరంతరంగా కొనసాగింది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు, పోలీసులు పర్యవేక్షించారు.


క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

రవాణా శాఖలో అధికారుల బదిలీలు

తిమ్మాపూర్, ఫిబ్రవరి17: తెలంగాణ ప్రభుత్వం రవాణా శాఖలో భారీగా బదిలీలను చేపట్టింది. డిప్యూటి ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ల(డీటీసీ) నుంచి రీజినల్ ట్రాన్స్ పోర్ట్ ఆఫీసర్లు(ఆర్‌టీవో), మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టరు (ఎంవీఐ), అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పె క్టర్ల(ఏఎంవీఐ)ల వరకు బదిలీ ఆయ్యారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బదిలీలు ఇలా ఉన్నాయి. ఈ బదిలీ ల్లో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు సంబంధించి డీటీసీగా ఉన్న మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్‌ను రంగారెడ్డి జిల్లాకు బదిలీ చేశారు. వరంగల్ డీటీసీ పి పురుషోత్తం ఉమ్మడి కరీంనగర్ జిల్లా డీటీసీగా బదిలీ ఆయ్యారు.

● కరీంనగర్ జిల్లా రవాణా కార్యాలయం నుంచి బదిలీఅయిన వారిలో ఆర్‌నాగలక్ష్మి(ఎంవీఐలు) కామారెడ్డికి, ఎం.శ్రీనివాస్(ఎంవీఐ)జగిత్యాల జిల్లా కోరుట్లకు, ఠాకుర్ ఈశ్వర్‌సింగ్(ఎంవీఐ) నిర్మల్‌కు, బి.రజినిదేవి (ఏఎంవీఐ), రాజన్న సిరిసిల్లకు బదిలీ ఆయ్యారు. కాగా టి రవికుమార్(ఎంవీఐ) ఆదిలాబాద్, కె.వేణు(ఎంవీఐ), హనుమకొండ, బి.శ్రీకాంత్ చక్రవర్తి(ఎంవీఐ) కుమరం ఆసిఫాబాద్, స్రవంతి(ఏఎంవీఐ), హనుమకొండ నుంచి కరీంనగర్ జిల్లాకు బదిలీపై వచ్చారు.

● రాజన్న సిరిసిల్ల జిల్లా రవాణా శాఖ కార్యలయం నుంచి వై కొండల్‌రావు (ఆర్‌టీవో) హుస్నాబాద్‌కు, ఏ.కిషోర్ చంద్రారెడ్డి(ఎంవీఐ) మంచిర్యాల, టి విజయ్‌కుమార్(ఏఎంవీఐ)ఆదిలాబద్‌కు బదిలీ ఆయ్యారు. వి లక్ష్మణ్(ఎంవీఐ)సిద్దిపేట జిల్లా శోభన్ బాబు(ఎంవీఐ) బోధన్ నుంచి రాజన్న సిరిసిల్లకు బదిలీ అయ్యారు.

● జగిత్యాల జిల్లా నుంచి సీహెచ్ రంజీత్ కుమార్ (ఎంవీఐ) మంచిర్యాలకు, వెంకటరమణ(ఎంవీఐ) కొత్తగూడెంకు, షేక్ ఖాసీమ్ సహెబ్(ఏఎంవీ) మంచి ర్యాలకు బదిలీ అయ్యారు. శ్రీనివాస్(ఎంవీఐ)కోరుట్ల, వెంకన్న (ఎంవీఐ)మహబూబాబాద్, సీహెచ్ రామా రావు(ఏఎంవీఐ)ఆదిలాబాద్ నుంచి జగిత్యాలకు బదిలీ అయ్యారు.

● పెద్దపల్లి జిల్లా నుంచి అఫ్రిన్ సిద్దిఖి(ఎంవీఐ) ఖమ్మంకు, సిరాజ్ ఉర్ రహ్మాన్ (ఏఎంవీఐ), ములుగు జిల్లాకు, అలే శ్రీనివాస్ అదిలాబాద్‌కు బదిలీ అయ్యారు. ఉమార్ ఫారుఖ్(ఏఎంవీఐ) పాల్వాంచ చెక్ పోస్ట్ భద్రాద్రి కొత్త గూడెంకు బదిలీ కాగా పి రంగారావు (ఎంవీఐ) వరంగల్ నుంచి శివ స్వప్న(ఎంవీఐ) నిర్మల్ నుంచి, బి శ్రీనివాస్(ఏఎంవీఐ) భూపాలపల్లి జయశంకర్ నుంచి పెద్దపల్లి జిల్లాకు బదిలీ అయ్యారు.

హైనా దాడిలో లేగదూడ మృతి

చిగురుమామిడి, ఫిబ్రవరి 17: మండలంలోని నవాబుపేటలో మర్రి శ్రీనివాస్ అనే రైతు లేగదూడపై హైనా దాడి చేయడంతో తీవ్ర గాయాలై మృతి చెందింది. శ్రీనివాస్ పశువులను బావి వద్దనే కట్టి వేస్తాడు. శనివారం ఉదయం బావి వద్దకు వెళ్లి చూడగా లేగ దూడ మృతి చెంది ఉందని రైతు తెలిపాడు.

పెళ్లెప్పుడవుతుంది.. పిల్ల ఏడ దొరుకుతుంది

సండే స్పెషల్



వధువుల కోసం యువకులు, తల్లిదండ్రుల వేట

● అన్ని రకాలుగా స్థిరపడ్డా కుదరని పెళ్లి సంబంధాలు

● గ్రామాల్లో, పట్టణాల్లోనూ ఇదే పరిస్థితి

● పెరుగుతున్న పెళ్లికాని ప్రసాదులు

'మా వోడు హైదరాబాద్‌లో జాబ్ చేస్తున్నడు.. నెలకు లక్షన్నర వరకు సంపాదిస్తున్నడు.. పిల్లనికి ఎటువంటి అలవాట్లు లేవు.. ఐదేండ్లయింది.. పిల్లను చూడవట్టి.. ఎంత చూసినా సంబంధం ఖాయం అయితలేదు.. పెండ్లి సంబంధాలు చూసేటోళ్లకు చెప్పినం.. చుట్టాలల్ల చెప్పి ఉంచినం.. చూస్తుండగనే 30 ఏండ్లు దాటినయి.. నెత్తిమీద ఎంట్రుకలు ఊడి పోతున్నయి.. ముందు కట్నం.. గిట్నం అని అన్నం.. తరువాత పెళ్లి చేసి ఇస్తే చాలన్నం.. ఇప్పుడయితే మేమే అన్ని ఖర్చులు పెట్టుకుంటం అంటున్నం.. అయినా పిల్ల దొరకుత లేదు.. వాని ఎక్కడ రాసి పెట్టి ఉందో'.. ఇదీ పెళ్లికాని యువకుల తల్లిదండ్రుల ఆవేదన. రోజురోజుకు పెళ్లికాని యువకుల సంఖ్య పెరిగిపోతోంది. ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా సంబంధాలు కుదరకపోవడంతో యువకులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

■ ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల

గతంలో కన్యాశుల్కం ఇచ్చి వివాహాలు చేసుకునేవారు. తరువాత వరకట్నం మొదలైంది. సాంప్రదాయంగా ప్రారంభమైన ఈ పద్ధతి ఆడపిల్లల తల్లిదండ్రులకు భారంగా మారింది. ఇప్పుడు పరిస్థితి మారింది. రానురాను ఆడపిల్లల సంఖ్య తగ్గుతుండడంతో వధువులకు డిమాండ్ పెరిగింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో వెయ్యి మంది పురుషులకు 942 మంది నిష్పత్తిలో మహిళలు ఉన్నారు.

● వధువుల కోసం ప్రయత్నాలు

జీవితాంతం ఆనందమయంగా గడపాలని అందరు కోరుకుంటారు. అదే క్రమంలో యువతులు చక్కని ఉద్యోగం చేసే భర్త కావాలని కోరుకుంటున్నారు. ఈ క్రమంలోనే జీవితంలో స్థిరపడాలనే తపనతో ఈడుదాటి పోవడంతో యువకులు వధువుల కోసం వెతుకులాడే పరిస్థితి పెరిగి పోతుంది. ఎక్కడ చూసినా ఎక్కడైనా ఆడ పిల్ల ఉంటే చెప్పండి మా వాడు బెంగుళూర్, ముంబై, పుణే సాఫ్ట్‌వేర్ రంగంలో పని చేస్తున్నాడని తల్లిదండ్రులు అడుగుతున్న తీరు తరుచూ కనిపిస్తుంది. గతంలో ఉన్న పట్టింపులకు కూడా మరిచి రాశి, నక్షత్రం, గోత్రం మేం పట్టించుకోమని, అమ్మాయి బాగుంటే చాలని అడుగుతున్నవారు కూడా ఉన్నారు.

● వ్యవసాయం చేసే వారికి ఇబ్బందులు

పెళ్లిళ్ల విషయంలో వ్యాపారాలు చేసే యువకులతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ ఆధారిత యువకులకు అమ్మాయిలు దొరకడం కష్టంగా మారింది. అబ్బాయి ఉన్నత చదువులు చదివి వ్యవసాయం చేస్తూ బాగా సంపాదిస్తున్నా గ్రామీణ ప్రాంతాల్లో ఉండడానికి అమ్మాయిలు ఇష్టపడడం లేదు. గ్రామాల్లో ఉండే అమ్మాయిలు పట్టణాల్లో సాఫ్ట్‌వేర్, కనీసం ప్రైవేటు రంగాల్లో పనిచేసే వారిని ఇష్టపడుతున్నారు. గతంలో వరకట్నాలు అబ్బాయిలు అడిగిన వారే పెళ్లయితే చాలని అన్ని ఖర్చులు భరించి పెళ్లి చేసుకుంటున్నారు. మరికొన్ని కుటుంబాలు కులాలను కూడా పట్టించుకోవడం లేదు. అమ్మాయి బాగుండి చదువుకుంటే అగ్రకులానికి చెందిన యువకులు సైతం కులాలు చూడకుండా పెళ్లి చేసుకుంటున్నారు.

● మారుతున్న పరిస్థితులు

గతంలో 18 ఏళ్లలోపే ఏ పని చేసినా చేయకపోయినా పెద్దలు వివాహాలు జరిపించే వారు. ఇప్పుడు మారుతున్న కాలంలో ఉన్నత చదువులు, ఆర్థికంగా స్థిరపడిన తరువాతే వివాహం చేసుకోవాలని భావిస్తుండడంతోనే 40 ఏళ్లు దాటినా పెళ్లిళ్లు కావడం లేదు. దీంతో చివరకు ఎవరైనా సరే అనుకున్నప్పటికి అమ్మాయిలు దొరకడం లేదు. యువకులతో పోల్చుకుంటే యువతుల సంఖ్య తక్కువగా ఉండడం కూడా మరో కారణం. రోజురోజుకు మ్యారేజ్ బ్యూరోలు పెరుగుతున్నాయి. మధ్యవర్తులు కమీషన్లు తీసుకుని పెళ్లిళ్లు కుదురుస్తున్నారు.

● ఇతర రాష్ట్రాలకు పరుగులు

గతంలో దగ్గరి సంబంధాలు కుదుర్చుకునే వారు. ఇప్పుడు అమ్మాయిల కోసం ఇతర రాష్ట్రాలకు సైతం వెళ్తున్నారు. తెలంగాణ, ఆంధ్రా రాష్ట్రాలే కాకుండా పొరుగున ఉన్న మహారాష్ట్ర, కర్ణాటకలో సంబంధాలు వెదుకుతున్నారు.

ఆర్థికంగా స్థిరపడ్డా అమ్మాయి దొరకడం లేదు

- కీర్తి విజయ్



ఆర్థికంగా నిలదొక్కుకునే వరకు వివాహం చేసుకోవద్దని అనుకున్నాను. వ్యాపారంగా, ఆర్థికంగా స్థిరపడ్డాను. ఇప్పుడు అమ్మాయి దొరకడం లేదు. అమ్మాయిల సంఖ్య రోజురోజుకు తగ్గిపోవడమే కారణంగా అనుకుంటున్నాను.

భ్రూణ హత్యలు తగ్గాలి

- అంజయ్య, న్యాయవాది, జిల్లాల బాలల సంక్షేమ సమితి చైర్మన్



ఆడపిల్లలపై వివక్ష, అపోహలు తొలగించుకోవాలి. ఆధునిక యుగంలో ఎన్నో మార్పులు వచ్చాయి. భ్రూణ హత్యల వల్ల ఆడమగ నిష్పత్తి దెబ్బతింటుంది. భ్రూణ హత్యలు తగ్గాలి. ప్రస్తుతం వెయ్యిమంది మగపిల్లలకు 942 మంది ఆడపిల్లలు ఉన్నారు. ఇలాగే కొనసాగితే ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతాయి.

20న మినీ జాబ్‌మేళా

గణేశ్‌నగర్, ఫిబ్రవరి17: అపోలో హోమ్ హెల్త్ కేర్ హైదరాబాద్‌లో ఉద్యోగాలు కల్పించేందుకు మంగళవారం జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనా అధికారి.కె.దేవేందర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగ యువతీ యువకులు తమ బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలన్నారు.

ఎస్‌యూలో వర్క్‌షాప్

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 17: ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ అండ్ రీసెర్చ్(ఐసిఎస్ఎస్ఆర్) న్యూ ఢిల్లీవారి ఆర్థిక సహకారంతో శాతవాహన విశ్వవిద్యాలయం ఆర్థిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో తెలంగాణ గ్రామీణ ప్రాంతాలలో సుకన్య సమృద్ధి యోజన పథకం ఆర్థిక సమ్మిళిత వృద్ధి అనే అంశంపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ మల్లేష్ హాజరై మాట్లాడుతూ సుకన్య సమృద్ధి యోజన పథకం ద్వారా బాలికల పేరుమీద చిన్న వయసు నుండే పొదుపు చేయడం ద్వారా వారి విద్య వివాహాల ఖర్చులకు ఇంతగానో ఉపయోగ పడుతుందని అన్నారు. కార్యక్రమంలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ అండ్ రీసెర్చ్ దక్షిణ ప్రాంతీయ కార్యాలయ అధికారి, ప్రొఫెసర్ బి.సుధాకర్ రెడ్డి పోస్టల్ సూపరిండెంట్, కరీంనగర్ కే. శివాజీ, అర్థశాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ కే.శ్రీవాణి, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ వరప్రసాద్, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. నజీరుద్దీన్ మునావర్ పాల్గొన్నారు.

ఎన్టీరామారావుకు భారతరత్న ఇవ్వాలి

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 17: స్వర్గీయ నందమూరి తారక రామారావుకు కేంద్రప్రభుత్వం భారతరత్న పురస్కారం వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేస్తూతెలంగాణ చౌక్‌లో నిరసన ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో కళ్యాడపు ఆగయ్య, పార్లమెంట్ అధ్యక్షులు వంచ శ్రీనివాస్ రెడ్డి, సందబోయిన రాజేశం, సాయిల్ల రాజమల్లయ్య, రోడ్డ శ్రీధర్, ఎర్రోజు హయగ్రీవచారి పాల్గొన్నారు.

గుల్జార్‌కు జ్ఞానపీఠ్ అవార్డు ప్రకటనపై హర్షం

కరీంనగర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గొప్పకవి, సినీ గేయ రచయిత, సినీ దర్శకుడు, బహుముఖ కార్యశీలి, ప్రతిభావంతుడైన గుల్జార్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక జ్ఞానపీఠ్ అవార్డు శనివారం ప్రకటించింది. గుల్జార్ రచించిన గ్రీన్ పోయెమ్స్, కవిత్వ సంకలనాన్ని కరీంనగర్‌కు చెందిన కవి అనువాదకుడు, డాక్యుమెంటరీ ఫిలిం దర్శకుడు వారాల ఆనంద్ 'ఆకుపచ్చ కవితలు' పేరుతో తెలుగులోకి అనువదించారు. ఇందుకు వారాల ఆనంద్‌కు గత సంవత్సరం కేంద్ర సాహిత్య అవార్డును ప్రకటించింది. ఈ సందర్భంగా వారాల ఆనంద్ మాట్లాడుతూ గుల్జార్ లాంటి గొప్పకవికి జ్ఞానపీఠ్ పురస్కారం రావడం ఎంతో అభినందనీయమని అన్నారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సమీక్ష సమావేశం

కరీంనగర్ లీగల్, ఫిబ్రవరి 17: తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఆదేశాల మేరకు డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వింజమూరి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్త పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. శనివారం స్థానికజిల్లా కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన ఈసమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రాసిక్యూటర్లు కోర్టు విధుల్లో బాధ్యతగా ఉండాలని అన్నారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జ్యోతిరెడ్డి ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన కొత్త చట్టాలను వివరించారు. ఈ సమావేశంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు జంగిలి మల్లికార్జున్, బాల త్రిపుర సుందరి, ఆరెల్లి రాములు, జూలూరు శ్రీరాములు, గౌరు రాజిరెడ్డి, గడ్డం లక్ష్మణ్, కాసారం మల్లేశం, మురళీధర్‌రావు, వసంత పాల్గొన్నారు.

బిర్లా విద్యార్థులకు ఇన్‌స్పైర్ అవార్డులు

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 17: నగరంలోని బిర్లా ఓపెన్‌మైండ్స్ స్కూల్ విద్యార్థుల పరిశోధనలకు గాను ఇన్‌స్పైర్ అవార్డులకు అందుకున్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజి (డిఎస్‌టి), భారత ప్రభుత్వం ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ పర్స్యూట్ ఫర్ ఇన్‌స్పైర్ రీసెర్చ్ అవార్డులకు పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులకు ఎంపికయ్యారు. లావర్తి సన, రయాన్ అబ్దుల్లా, సదుర్ల వైనవిలు ఎంపికయ్యారు. పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ బబిత విశ్వనాథన్ అభినందించారు.

దీప్‌దాస్ మున్షిని కలిసిన ఆసంపల్లి శ్రీనివాస్

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 17 : కాంగ్రెస్‌పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి దీప్‌దాస్ మున్షీని గాంధీభవన్‌లో కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు ఆసంపల్లి శ్రీనివాస్ శనివారం కలిశారు. కాంగ్రెస్‌పార్టీ నుంచి పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఒక వినతిపత్రం అందజేశారు. అనంతరం సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు రేణుకాచౌదరిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

పూలే విగ్రహానికి క్షీరాభిషేకం

గణేశ్‌నగర్, ఫిబ్రవరి17: శాసనసభలో సమగ్ర కుల గణనకు ఏకగ్రీవ ఆమోదం తెలిపిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ నగరంలోని శాతవాహన యూనివర్సిటీ ఎదుట గల జ్యోతిబా పూలే విగ్రహానికి జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు పులి ఆంజనేయులు గౌడ్, పట్టణ కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, కరీంనగర్‌నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పురుమల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఏసీపీకి సన్మానం



బదిలీపై వెళ్తున్న ఏసీపీ జీవన్‌రెడ్డిని సన్మానిస్తున్న సీపీ అభిషేక్ మొహంతి

హుజూరాబాద్, ఫిబ్రవరి 17: హుజూరాబాద్ ఏసీపీగా పనిచేసిన జీవన్‌రెడ్డి బదిలీపై ఆదిలాబాద్ జిల్లాకు వెళ్లగా శనివారం కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతి సన్మానించారు. హుజూరాబాద్ ఏసీపీగా పనిచేసిన జీవన్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో సమర్థవంతంగా పనిచేశారని సీపీ కొనియాడారు. కార్యక్రమంలో అడిషనల్ సీపీలు, ఏసీపీలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్టు

హుజూరాబాద్, ఫిబ్రవరి 17: హుజూరాబాద్ పట్టణంలో జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని శనివారం మహాత్మా జ్యోతిబాపూలే బీసీ వేల్ఫేర్ పాఠశాలలో విద్యార్థులకు టాలెంట్ టెస్టు నిర్వహించారు. గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్టు నిర్వాహకులు గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అంద జేశారు. కార్యక్రమంలో గంగిశెట్టి జగదీశ్వర్, సంపత్ పాల్గొన్నారు.

సైదాపూర్: సైదాపూర్ జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. గెలుపొందిన విద్యర్థులకు అసిస్టెంట్ ప్రిన్సిపాల్ సంపత్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

హుజూరాబాద్ ఎంవీఐగా వేణు

హుజూరాబాద్, ఫిబ్రవరి 17: హుజూరాబాద్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా కంచె వేణును నియమిస్తూ రాష్ట్ర ట్రాన్స్‌పోర్టు ప్రిన్సిపాల్ సెక్రటరీ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఠాకూర్‌సింగ్‌ను భైంసా చెక్‌పోస్టుకు బదిలీ చేశారు. హనుమకొండలో పనిచేస్తున్న వేణును హుజూరాబాద్ ఎంవీఐగా నియమించారు.

హుజూరాబాద్ ఆర్డీవోగా శకుంతల

హుజూరాబాద్, ఫిబ్రవరి 17: హుజూరాబాద్ రెవెన్యూ డివిజన్ అధికారిగా శకుంతలను శనివారం నియమిస్తూ రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఆర్డీవో రాజును జహీరాబాద్‌కు బదిలీ చేశారు. హైదరాబాద్‌లో పనిచేస్తున్న శకుంతలను హుజూరాబాద్ ఆర్డీవోగా నియమించారు.

సంక్షేమ వసతి గృహాలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి

హుజూరాబాద్, ఫిబ్రవరి 17: హుజూరాబాద్, జమ్మికుంటలలోని సంక్షేమ వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థులపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కె రాము శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో వార్షిక పరీక్షలు ప్రారంభ మవుతున్నందున విద్యార్థులకు టైం ప్రకారం భోజనంతో పాటు వసతులు కల్పించాలని కోరారు.

'నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి'

జమ్మికుంట, ఫిబ్రవరి 17: నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని డీవైఎఫ్ జిల్లా అధ్యక్షులు డి నరేష్ అన్నారు. శనివారం పట్టణంలో కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యక్రమంలో సాయి, చరణ్, జీవన్, సిద్ధు, స్వాగత్, బాలు, సురేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహ సంబంధాలు పెంపొందుతాయి



హ్యాండ్‌బాల్ క్రీడల ప్రారంభోత్సవంలో పాల్గొన్న అతిథులు

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 17: క్రీడలతో స్నేహ సంబంధాలు పెంపొందు తాయని తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గోనె శ్యామ్ సుందర్, శ్యామల పవన్‌కుమార్, కోశాధికారి వనపర్తి రమేశ్ జ్యోతి అన్నారు. 52వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సీనియర్స్ హ్యాండ్‌బాల్ పోటీలు శనివారం రాత్రి కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణలోని ఉమ్మడి జిల్లాల నుంచి 250 మంది క్రీడాకారులు, 50 మంది అధికారులు హాజరయ్యారు. కరీంనగర్‌లోని లయోలా జూనియర్ కాలేజీలో జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను వారు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో హ్యాండ్‌బాల్ క్రీడకు మంచి ఆదరణ ఉందన్నారు. క్రీడలతో శారీరక అభివృద్ధి, మానసిక వికాసం పెంపొందతాయన్నారు. పోటీల నిర్వాహణ కార్యదర్శి, జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి బాసరవేని లక్ష్మణ్ క్రీడా నివేదిక సమర్పిస్తూ ఈ క్రీడల్లో ప్రతిభ చాటే క్రీడాకారులను జాతీయ స్థాయిలో పాల్గొనే తెలంగాణ రాష్ట్ర జట్లుకు ఎంపిక చేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు, అధికారులకు మూడు రోజులపాటు ఉచిత భోజన, వసతి సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. ఉమ్మడి పది జిల్లాల నుంచి 20 మహిళలు, పురుషుల జట్లు పాల్గొని మూడు రోజులపాటు తలపడనున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా హ్యాండ్ సంఘం అధ్యక్షుడు వీర్ల వెంకటేశ్వర్‌రావు, పోటీల పరిశీలకులు దీపక్ ప్రసాద్, ఢిల్లీ డిఫెన్స్ అకాడమి సతీష్‌రెడ్డి, ఎస్‌వీజేసీ విద్యాసంస్థల చైర్మన్ మహిపాల్‌రెడ్డి, హరికృష్ణ, లయోలా కాలేజీ ప్రిన్సిపాల్ జోసెఫ్, జిల్లా సంఘం సంయుక్త కార్యదర్శి నమిలికొండ ప్రభాకర్, కోచ్ మూల వెంకటేష్, పీఈటీలు నాగుల శ్రీనివాస్, దుర్గరాజు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షా ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్,ఫిబ్రవరి 17: ఎస్.యూ పరిధిలోని డిగ్రీ మొదటి సెమిస్టర్, మూడో సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదల చేసినట్లు ఎస్. యూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్ వి శ్రీ రంగ ప్రసాద్ తెలిపారు.విద్యార్థులు తమ ఫలితాలను యూనివర్సిటీ వెబ్ సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఎస్‌యూ.ఏసీ.ఇన్ లో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

హనుమకొండ పీవోడీటీగా డాక్టర్ లలితాదేవి

సుభాష్‌నగర్,ఫిబ్రవరి 17: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా పని చేసిన డాక్టర్ లలితాదేవి హనుమకొండ పీఓడీటీగా శుక్రవారం విధుల్లో చేరారు. అనారోగ్య కారణాలతో కొద్ది రోజులుగా ఆమె సెలవుల్లో ఉన్నారు. వైద్య ఆరోగ్యశాఖలో అన్ని రకాల డిప్యూటేషన్లు రద్దు చేయడంతో ఆమె తిరిగి తన రెగ్యులర్ పోస్టులో చేరారు.ప్రస్తుతం కరీంనగర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ సుజాత కొనసాగుతున్నారు. అయితే కరీంనగర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా రావాల్సిన డాక్టర్ వెంకట రమణ వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్నారు. డిప్యూటేషన్లు రద్దు చేయడంతో ఆయన వస్తాడా లేదా అనేది వేచి చూడాల్సిందే.

'అచీవర్స్'లో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్

గణేశ్‌నగర్,ఫిబ్రవరి17: కోతిరాంపూర్‌లోని అచీవర్స్ యాక్టివ్ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ లో భాగంగా తమ చిత్రాలను, కళాఖండాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పాఠశాల డైరెక్టర్ సి.హెచ్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న కళా నైపుణ్యాన్ని వారి అభిరుచులకు తగ్గట్టుగా ఈ ప్రదర్శన నిర్వహించామని తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సి.హెచ్. వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ సి.హెచ్. పల్లవి పాఠశాల సిబ్బంది ,విద్యార్థిని విద్యార్థులు, అధిక సంఖ్యలో తల్లిదండ్రులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

రేకుర్తిలో మైక్రోస్కోప్ ప్రారంభించిన కలెక్టర్

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 17: నగరంలోని రేకుర్తి కంటి ఆసుపత్రిలో శనివారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మైక్రోస్కోప్‌ను ప్రారంభించారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ కరీంనగర్ డాక్టర్‌భాస్కర్ మాడేకర్ ఉదారనేత్ర వైద్యశాలలో ఆపరేటింగ్ మైక్రోస్కోప్‌ను ప్రారంభించిన అనంతరం ఆసుపత్రిలోని పలు విభాగాలు పరిశీలించి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైద్యశాల చైర్మన్ కొండ వేణుమూర్తి, కార్యదర్శి ప్రకాశ్‌హోల్లా పాల్గొన్నారు.

సిద్దార్థలో అలరించిన వార్షికోత్సవం

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 17: నగరంలోని అంబేద్కర్ స్టేడియంలో శనివారం రాత్రి సిద్దార్థ విద్యాసంస్థల ఆధ్వర్యంలో 'సంస్కృతి-2024' పేరుతో నిర్వహించిన వార్షికోత్సవం ఎంతగానో అలరించింది. అతిథులుగా డీఈఓ జనార్ధన్‌రావు, క్రిసాలిక్ ఫౌండర్ అండ్ సీఈఓ చిత్రా రవి హాజరై విద్యాసంస్థల చైర్మన్ దాసరి శ్రీపాల్‌రెడ్డితో కలసి జ్యోతి ప్రకాశనం చేసి వేడుకలను ప్రారంభించారు. మంకమ్మతోట, భగత్‌నగర్, విద్యానగర్, సీతా రాంపూర్, చొప్పదండి ప్రాంతాల్లో గల విద్యాసంస్థ బ్రాంచ్‌లకు చెందిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుర అప్పగింత

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 17: కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ గ్రామానికి చెందిన బుడగజంగాల కాలనీకి చెందిన ఇద్దరు బాలలు తప్పిపోయి విశాఖపట్నంకు చేరు కోగా అక్కడి బాలల సంక్షేమ సమితి అధికారులు వారిని చేరదీసి క్షేమంగా కరీంనగర్‌కు చేర్చారు. కరీంనగర్ బాలల సంక్షేమ సమితి చైర్ పర్సన్ ధనలక్ష్మి, సభ్యులు రేండ్ల కళింగ శేఖర్‌లు తెలిపిన వివరాల ప్రకారం దుర్శేడ్‌కు చెందిన ఇద్దరు బాలలు సోదరులు(14,(10) 2023 అక్టోబరు 27న ఇంటి నుంచి తప్పిపోయి రైలులో విశాఖ పట్నంకు చేరారు. అక్కడ అనుమా నాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు బాలురను రైల్వే పోలీసులు గుర్తించి వెంటనే వారిని అక్కడి బాలల సంక్షేమ సమితికి అప్పగించారు. విశాఖపట్నం బాలుర వసతి గృహంలో ఇద్దరిని చేర్పించిన అనంతరం వారి వివరాలను అడిగి తెలుసుకుని కరీంనగర్ జిల్లాకు చెందినవారిగా నిర్ధారించారు. విశాఖపట్నంకు వెళ్లి పిల్లలను తీసుకువచ్చే స్తోమత తమ వద్దలేదని తల్లిదండ్రులు నిస్సహాయతను వ్యక్తం చేశారు. దీంతో విశాఖపట్నం బాలల సంక్షేమ సమితి ఆధీనంలో ఉన్న ఇద్దరు బాలురను శనివారం పోలీసుల ఎస్కార్ట్‌తో కరీంనగర్‌కు పంపించారు. బాలుర తల్లిదండ్రులు తీసుకు వెళ్లేందుకు ప్రస్తుతం అందుబాటులో లేక పోవటంతో సంక్షేమ సమితి హోంలో ఉంచారు. తల్లిదండ్రులు రాగానే వారికి అప్పగిస్తామని బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ ధనలక్ష్మి, సభ్యులు రేండ్ల కళింగ శేఖర్‌లు తెలిపారు. కార్యక్ర మంలో బాలల సంక్షేమ సమితి చైర్ సభ్యు లు అర్చన, రాధా, విజయ్, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 ప్రతినిధులు సాయి కిరణ్, ప్రియాంక, అనూష, విశాఖపట్నం స్పెషల్ జువైనల్ పోలీసు అధికారి సూర్యనారాయణ, కుమార్‌లు పాల్గొన్నారు.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి17: కేసీఆర్ 70వ జన్మదినం సందర్భంగా శనివారం నగరంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టారు. తెలంగాణ చౌక్‌లో పార్టీ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో 70 కిలోల భారీ కేక్ కటింగ్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మేయర్ సునీల్‌రావు, జిల్లా పార్టీ అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు హాజరయ్యారు. మేయర్ సునీల్‌రావు ఉచితంగా పేద ప్రజలకు భోజనం పెట్టించారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరే టర్లు వాల రమణారావు, ఏదుల్ల రాజశేఖర్, తోట రాములు, గందె మాధవిమహేశ్, గుగ్గిళ్ళ జయశ్రీశ్రీనివాస్, సరిళ్ల ప్రసాద్, వంగల శ్రీదేవిపవన్ తదితరులు పాల్గొన్నారు.

●నగరంలోని మార్కెట్‌రోడ్డు శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్ ప్రత్యేక పూజలు చేశారు. మాజీ మేయర్, మాజీ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్ ఆధ్వర్యంలో నగరంలోని అనాధ పిల్లల స్కూల్‌లో విద్యార్థులకు బూట్లుపంపిణీ చేశారు.

●**కరీంనగర్‌రూరల్:** కొత్తపల్లిపట్టణంలో మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు కేక్ కట్ చేశారు. కొత్తపల్లి మండలం చింతకుంట గ్రామంలో ఎంపీపీ పిల్లి శ్రీలత కేక్ కట్ చేశారు. కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మయ్య పాల్గొన్నారు.

●**హుజూరాబాద్/జమ్మికుంట/శంకరపట్నం/సైదాపూర్/ఇల్లందకుంట/మానకొండూర్/ తిమ్మాపూర్/ వీణవంక/గంగాధర/ గన్నేరువరం/ చొప్పదండి/చిగురుమామిడి:** హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేశారు. జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమాల్లో మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ పాల్గొన్నారు. శంకరపట్నం, సైదాపూర్, ఇల్లందకుంట, మానకొండూర్, తిమ్మాపూర్, వీణవంక, గంగాధర, గన్నేరువరం, చొప్పదండి, చిగురుమామిడి మండల కేంద్రాలతో పాటు ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేశారు.

సమస్యల తిష్ఠ

- ట్రాఫిక్ సమస్యతో వాహనదారుల ఇక్కట్లు
- తాళం వేసి ఉన్న ఇళ్లల్లో చోరీలు
- గంజాయి మత్తులో జోగుతున్న యువత



గంజాయి విక్రయదారులను అరెస్ట్ చేసిన పోలీస్‌లు(ఫైల్)

జమ్మికుంట, ఫిబ్రవరి 17: వ్యాపార కేంద్రమైన జమ్మికుంటలో పలు సమస్యలు చోటు చేసుకున్నాయి. ఉత్తర తెలంగాణలో రెండో అతి పెద్ద వ్యవసాయ మార్కెట్ ఇక్కడ ఉంది. చుట్టూ వంద గ్రామాల ప్రజల రాకపోకలు సాగిస్తుంటారు. రైల్వే ఓవర్ బ్రిడ్జికి ఇరువైపులా ఇరుకు రోడ్లు, ఎఫ్‌సీఐకి వెళ్లే రోడ్డులో ఉన్న పాత కూరగాయల మార్కెట్ రోడ్డు చిన్నదిగా ఉండడంతో ప్రయాణికు లు ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ ఉత్పత్తులు, ఇతర రాష్ట్రాలకు భారీ లోడ్‌లతో వెళ్లి వచ్చే లారీలతో పట్టణం నిత్యం రద్దీగా ఉంటుంది. గాంధీ చౌరస్తా నుంచి హుజూరాబాద్ రోడ్, వీణవంక, కోరపల్లి వైపు వెళ్లే రోడ్డు మార్గాల్లో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.రోడ్లకు ఇరువైపులా చిరు వ్యాపారుల తోపుడు బండ్లు, ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

● ఇతర రాష్ట్రాల నుంచి..

జమ్మికుంటలో రైల్వేస్టేషన్ ఉండడం వల్ల ఇతర రాష్ట్రాల నుంచి రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. దీన్ని ఆసరాగా తీసుకుని దుండగులు చోరీలకు పాల్పడుతున్నారు. వారసంతల్లో సెల్‌ఫోన్లు చోరీలకు పాల్పడిన ఘటనలు చోటు చేసుకున్నాయి. మహిళల మెడ నుంచి గొలుసులు లాక్కెళ్లడం, తాళం వేసి ఉన్న ఇళ్లల్లో చోరీలకు పాల్పడడం వంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. పట్టణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా మరమ్మతుల విషయం పట్టించుకోక పోవడంతో దుండగులు చోరీలకు పాల్పడుతు న్నారు. ఇసుక అనుమతి లేకుండా తరలిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. పట్టణంలో గంజాయి విక్రయాలు సైతం యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. మున్సిపల్ పరిధిలో ఇప్పటికే పలుమార్లు పోలీస్‌లు గంజాయి విక్రయదారులను అదుపులోకి తీసుకున్నారు. యువత రాత్రి వేళల్లో పలు ప్రాం తాల్లో అడ్డా ఏర్పాటు చేసుకుని గంజాయి సేవిస్తూ మత్తులో జోగుతున్నారు. దీంతో రాత్రి వేళల్లో అటు వైపు ఎవరైనా వెళ్లాలంటే జంకుతుంటారు. ఉన్నతాధికారులు స్పందించి చోరీలతో పాటు గంజాయి విక్రయాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పూలే చిత్రపటానికి క్షీరాభిషేకం

చొప్పదండి, ఫిబ్రవరి 17: అసెంబ్లీలో సమగ్ర కుల గణనకు ఏకగ్రీవ ఆమోదం తెలిపినందుకు హర్షం వ్యక్తం చేస్తూ చొప్పదండిలో పూలే చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ముద్దం తిరుపతి, బీసీ సెల్ అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

గన్నేరువరం: కాంగ్రెస్ మండల బీసీ సెల్ అధ్యక్షుడు మార్గం మల్లేశం ఆధ్వర్యంలో పార్టీ శ్రేణు లు సంబరాలు నిర్వహించాయి. కార్యక్రమంలో బుర్ర తిరుపతి, వొడ్నాల నర్సయ్య, గాజులు సత్త య్య, టౌన్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీకాంత్, పెంకర్ల ప్రశాంత్, నవీన్ పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: సమగ్ర కులగణన కోసం అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసినందుకు గాను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు శనివారం బీసీ మండలా ధ్యక్షుడు తాటిపాముల రాము ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

ఇల్లందకుంట: సమగ్ర కుల గణన నిర్ణయం తీసుకొని దానిని అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఏకగ్రీవ ఆమోదం పొందే విధంగా కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దబ్బెట రవీందర్ ఒక ప్రకటనలో ప్రత్యేక అభినందనలు తెలిపారు.

చిగురుమామిడి: మండల కేంద్రంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా విశ్వ కర్మ పరిషత్ అధ్యక్షుడు కొత్తపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చారు. కార్యక్రమంలో జీడీటీసీ గీకురు రవీందర్, దాసరి ప్రవీణ్, తాళ్లపెల్లి బాస్కర్‌గౌడ్, బాలరాజు, మూసాపూరి సంపత్, మల్లం శ్రీనివాస్, చిమ్మోట నాగ రాజు, పోలోజు వేంకటేశ్వర్లు, పోలే కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు



పార్టీలో చేరిన నాయకులతో వొడితెల ప్రణవ్

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్ర వరి 17: మండలంలోని సింగాపూర్ గ్రామంలో నియో జకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ నివాస గృహం ఆవరణలో శనివారం పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కమలాపూర్ మండలం మర్రివానిపల్లి గ్రామానికి చెందిన పద్మశాలి కులస్థులు కమలాపూర్ మండలాధ్యక్షుడు చరణ్ పటేల్ అధ్యక్షతన భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా వొడితల ప్రణవ్ పార్టీ కుండవా కప్పి ఆహ్వానించారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

వీణవంక: మండలంలోని చల్లూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయములో శనివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమములో కాంగ్రెస్ పార్టీ ని యోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లను పరిశీలించారు. జాతర గోడపత్రికను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ చైర్మన్ వాల బాలకిషన్ రావు, నాయకులు ఎక్కటి రఘుపాల్‌రెడ్డి, పంజాల సతీష్, సురేందర్‌రెడ్డి, గడ్డం కూమా రస్వామి పెద్ది సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిరిసేడు శివాలయం చైర్మన్‌గా కొండ విజయ్

ఇల్లందకుంట, ఫిబ్రవరి 17: మండలంలోని సిరిసేడు గ్రామంలోని శ్రీఅపర్ణ సోమేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా కొండ విజయ్‌ను ఏకగ్రీవంగా శనివారం ఎన్నిక చేస్తూ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ నియామకపు పత్రాన్ని అందజేశారు. గౌరవ అధ్యక్షుడిగా గన్ను శ్రీకాంత్, ఆలయ ధర్మకర్తలుగా ము రహరి నరేందర్, రేణుకుంట్ల సారయ్య, కోడం రజిత-శ్రీనివాస్, వేముల సుధాకర్‌రెడ్డి, జిల్లెల దేవేందర్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ఇంగిలే రామారావు, అజ్గర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంటిలో చోరీ

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 17 : కరీంనగర్ హౌజింగ్‌బోర్డ్ కాలనీలో రిటైర్డ్ ఉద్యోగి తూం పృథ్వీధర్‌రావు ఇంటిలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని దొంగలు చొరబడి 26 గ్రాముల బంగారు ఆభరణాలను ఎత్తుకుపోయారని పోలీసులు తెలిపారు. శుక్రవారం ఉదయం ఇంటికి తాళంవేసి కుటుంబసభ్యులతోసహా జగిత్యాలకు వెళ్ళినామని, శనివారం ఉదయం ఇంటిపనిమనిషి వచ్చి చూసే సరికి తాళం పగులగొట్టి ఉందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. కప్‌బోర్డులో ఉన్న 26 గ్రాముల బంగారం గుర్తుతెలియని దొంగలు ఎత్తుకుపోయరని బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మూడో టౌన్ పోలీసులు తెలిపారు.

రిటైర్డ్ ఉద్యోగి అదృశ్యం

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 17: కరీంనగర్ సుభాష్‌నగర్‌కు చెందిన రిటైర్డ్ ఉద్యోగి ఎండీ ముజఫర్ హుస్సేన్ శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్ళి కనపడకుండా పోయాడని మూడో టౌన్ పోలీసులు తెలిపారు. ముజఫర్ హుస్సేన్ గత కొంత కాలంగా మతిస్థిమితంగా లేక బాధపడుతున్నాడని, ఉదయం 11 గంటలకు అల్పాహారం చేసిన తరువాత ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్ళి అదృశ్యమైనట్లుగా అతని భార్య రిజ్వానా బేగం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు అదృశ్యం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముగిసిన కస్టడీ

-ముగ్గురు జైలుకు తరలింపు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 17: వివాదంలో ఉన్న భూమికి నకిలీ ధృవపత్రాలు సృష్టించి విక్రయం పేరిట కోటి 37 లక్షలు వసూలు చేసిన కేసులో 17వ డివిజన్ కార్పొరేటర్ భర్త కోల ప్రశాంత్, 18వ డివిజన్ కార్పొరేటర్ భర్త సుధగోని కృష్ణగౌడ్, మరో వ్యక్తి ఏలేటి భరత్‌రెడ్డిల పోలీసు కస్టడీ ముగిసింది. నిందితులు ముగ్గురిని కొత్తపల్లి పోలీసులు శుక్రవారం ఉదయం కస్టడీకి తీసుకోగా శనివారం ఉదయం ముగ్గురిని కోర్టులో హాజరుపరచి జడ్జి ఆదేశాలతో తిరిగి కరీంనగర్ జిల్లా జైలుకు తరలించారు.

రెండో వివాహం చేసుకున్న వ్యక్తిపై కేసు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 17 : మొదటి భార్య ఉండగా దాచిపెట్టి యువతికి మాయమాటలు చెప్పి రెండవ వివాహం చేసుకున్నందుకు పెగడపల్లికి చెందిన శ్రీకాంత్‌పై కేసు నమోదు చేశామని రెండో టౌన్ సీఐ వెంకటేశ్ తెలిపారు. కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో 4 రోజుల నుంచి తన తల్లి అనారోగ్యంతో చికిత్స పొందుతుండగా ఆమెను చూసేందుకు వచ్చిన జూలపల్లి మండలానికి చెందిన ఒక యువతి శుక్రవారం రాత్రి నుంచి కనపడకుండా పోయింది. అయితే ఇదే ఆసుపత్రిలో గతంలో క్యాంటిన్‌లో పనిచేసే శ్రీకాంత్‌తో ఆ యువతి కలిసి వెళ్లిపోయినట్లు యువతి తల్లిదండ్రులు తెలుసుకుని రెండో టౌన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. ఆ యువతి కోసం వెదుకుతుండగా సాయంత్రం వరకు శ్రీకాంత్, యువతి వివాహం చేసుకుని టౌన్‌కు వచ్చారు. దీంతో పోలీసులు ఆ యువతికి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ చేసి యువతిని సఖీ సెంటర్‌కు పంపించారు. రెండో వివాహం చేసుకున్నదుకు శ్రీకాంత్‌పై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

సమ్మక్క జాతర ఏర్పాట్ల పరిశీలన

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 17: కొత్తపల్లి మండలం రేకుర్తిలోని సమ్మక్క జాతర ఏర్పాట్లను కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ ఇంచార్జి పురుమల్ల శ్రీనివాస్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, ఈఓ మారుతి, జాతర కమిటీ చైర్మన్ పిట్టల శ్రీనివాస్ పరిశీలించారు.

● సంక్షిప్త సమాచారం..

● వీణవంక: మండల కేంద్రంలో నిర్వహించే సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లను హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ పరిశీలించారు. ఆయన వెంట జమ్మి కుంట రూరల్ సీఐ, ఎస్సై వంశీకృష్ణ ఉన్నారు.

● రామడుగు: గోపాల్‌రావుపేటలో ధర్మ జాగరణ సమితి ఆధ్వర్యంలో శ్రీ సంత్ సేవాలాల్ మహా రాజ్ జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు ఎడవల్లి మైపాల్‌రెడ్డి, మండల సమన్వయకర్త పాకాల రాములు, బుర్ర సాయిలు పాల్గొన్నారు.

- మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన ఎడవల్లి కిషన్‌రెడ్డి కుమార్తె ఎడవల్లి అంజలి పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్‌గా ఎంపికైనందున తాజా మాజీ సర్పంచ్, జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న వెంకటరాంరెడ్డి సన్మానించారు.

● శంకరపట్నం: మండలంలోని పలు గ్రామాల్లో ఎన్ఆర్ ఈజీఎస్ నిధులతో మండల ప్రత్యేకాధికారుల ఆధ్వర్యంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య, టీపీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

● హుజూరాబాద్‌రూరల్: విద్యార్థులు పరిశోధనలపై దృష్టి పెట్టాలని జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర ప్రొఫెసర్ స్వరూపరాణి అన్నారు. మండలంలోని సింగాపూర్ గ్రామంలోని వీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో బాటని-జువాలజీ విభాగాల ఆధ్వర్యంలో సమగ్ర బోధన కార్యక్రమం నిర్వహించారు.

● హుజూరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో వాణిజ్య పన్నుల శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం టీఎన్‌జీవో సంఘం కృషి చేస్తుందని నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ ముజాహిద్ హుస్సేన్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్‌లో సంఘం ఎన్నికలు నిర్వహించామని పేర్కొన్నారు.

● సైదాపూర్: ఎంపీడీవోగా వచ్చిన యాదగిరిని ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు కొత్త తిరుపతిరెడ్డి, బిల్ల వెంకట్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ నాయకులు శనివారం సన్మానిచారు. కార్యక్రమంలో అబ్బిడి రవిందర్‌రెడ్డి, వీరారెడ్డి, కూతురు విద్యాన్‌రెడ్డి పాల్గొన్నారు.

● జమ్మికుంట రూరల్: ప్రజల ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు స్పం దిస్తామని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ అన్నారు. మ్మికుంట పోలీస్ స్టేషన్‌ను నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఏసీపీ సందర్శించారు.

● గంగాధర: విద్యార్థులు భయాన్ని వీడి నిర్భయంగా పరీక్షలు రాయాలని సురభి స్కూల్ కరస్పాండెంట్ చిప్ప వీరేశం అన్నారు. శనివారం పదో తరగతి విద్యార్థులకు పాఠశాలలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు.

● చిగురుమామడి: కాంగ్రెస్ పార్టీ సుందరగిరి గ్రామ శాఖ అధ్యక్షుడు ఎలగందులు లక్ష్మణ్ తల్లి భూదవ్వ(75) అనారోగ్యంతో శనివారం మృతి చెందగా పలువురు పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

●కరీంనగర్ టౌన్: అల్ఫోర్స్ ఐఐటి అకాడమీలో గత సంవత్సరం ఇంటర్మీడియట్ చదివిన రామంచ సుమసిత అత్యుత్తమ ర్యాంకుతో ఎన్ఐటి వరంగల్‌లో బీటెక్ కంప్యూటర్ సైన్స్ చేస్తోందని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. ప్రతి సంవత్సరం రిలయన్స్ ఫౌండేషన్ ఇస్తున్న స్కాలర్‌షిప్ ఇండియన్స్ బ్రైటెస్ట్ యూవర్ రెండు లక్షల స్కాలర్‌షిప్‌నకు సుమసిత ఎంపిక కావడం ప్రశంసనీయమని ఒక ప్రకటనలో అభినందించారు.

●కరీంనగర్ రూరల్: కొత్తపల్లి ఎంపిడిఓగా పనిచేసి బదిలీపై వెళ్లిన ఎడబోయిన శ్రీనివాస్‌రెడ్డిని కొత్తపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శ్రీలతమహేష్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నూతన ఎంపిడిఓ ప్రభు, ఎంపిఓ శ్రీనివాస్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.